క్లుప్తంగా

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



పెదకూరపాడు: మండలంలోని లగడపాడులో సంగం డెయిరీ మిల్క్ కలెక్షన్ సెంటర్‌లో పాల ఉత్పత్తిదారులకు ఆదివారం బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డెయిరీ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ మొత్తం 33 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.1,01,418 బోనస్ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మిల్క్ కలెక్షన్ సెంటర్ అధ్యక్షుడు బత్తుల కోటేశ్వర రావు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి



సత్తెనపల్లి: మాస శివరాత్రిని పురస్కరించుకొని సత్తెనపల్లి మండలం పెద మక్కెన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆదివారం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నకరికల్లు: మాసశివరాత్రి వేడుకలను మండలంలోని నర్సింగపాడు శ్రీ మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో, శ్రీ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని, స్వామివారిని విశేషంగా అలంకరించారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దివ్వెల, అన్నం



సత్తెనపల్లి: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (డబ్ల్యూఏఎం) ఆంధ్రప్రదేశ్ శాఖ ఉపాధ్యక్షులుగా పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన ఇద్దరు ఆర్యవైశ్య నాయకులకు అవకాశం లభించింది. పట్టణానికి చెందిన న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, వ్యాపారి అన్నం మురళీ శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు దేవతి భగవన్నారాయణ నుంచి ఇటీవల ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటి వరకు ఆర్యవైశ్య సంఘాల్లో చేసిన విశిష్ట సేవలను గుర్తించి వారికి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అవకాశమిచ్చారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో ఆదివారం వారిద్దరూ ప్రమాణస్వీకారం చేశారు. వారి నియామకంపై పట్టణంలోని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

బాణసంచా కొనాలంటే చుక్కలే



క్రోసూరు: చీకటిని పారదోలి ప్రతి ఇంటా వెలుగునింపే దీపావళి పండుగ జరుపుకునే రోజు రానే వచ్చింది. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసుకుని సాయంత్రం ఇళ్లముందు దివిటీలు వెలిగించి దైవరూపమైన లక్ష్మిని స్వాగతిస్తారు. నరకాసురుడి బాధ తొలగినందుకు టపాసులు కాల్చి ఆనందోత్సవాలు జరుపుకొంటారు. ఏటా దీపావళి పండుగకు టపాసుల ధరల పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి పడుతున్నారు. వంద రూపాయలకు టపాసులు వచ్చే రోజులు పోయి వెయ్యి పెడితేనే కొద్దిపాటి చిన్న సంచికి వస్తున్నాయని ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. అగ్గిపెట్టె నుంచి థౌజండ్ వాలా వరకు అన్ని టపాసుల ధరలు సుర్రుమంటున్నాయి. క్రోసూరు మండలంలో సుమారు 20 నుంచి 30 దుకాణాలు పెడుతుంటారు. ఆదివారం క్రోసూరులో కొన్ని దుకాణాలు ఏర్పాటు చేశారు.

పొలం బాటపై అన్నదమ్ముల ఘర్షణ

సత్తెనపల్లి: పొలానికి వెళ్లే బాట విషయంలో వరుసకు అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగిన ఘటన సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామంలో ఆదివారం జరిగింది. పాకాలపాడు నివాసితులు శింభా నాగేశ్వరరావు, ఆలా శ్రీను వరుసకు అన్నదమ్ములు. పొలం బాట విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు ఉండటంతో దాన్ని ప్రశ్నించే క్రమంలో రాళ్లు రువ్వుకున్నారు. దీంతో నాగేశ్వరావు నుదిటిపై, ఆయన భార్య, కుమారుడికి చేతులపై గాయాలయ్యాయి. ఇరు వర్గాలు సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

వైద్య విద్య ప్రైవేటీకరణ దారుణం

కోటి సంతకాల సేకరణలో నేతలు

నకరికల్లు: 'మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణం.. మేం ఒప్పుకోం' అంటూ మహిళలు పెద్దఎత్తున నిరసన గళం విప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యాన నకరికల్లులోని ఇందిరమ్మకాలనీలో కోటిసంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో సంతకాలు చేసి మరీ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకమంటూ నినదించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి మాట్లాడుతూ భావితరాల కోసం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యవిద్యను పేదల చెంతకు తీసుకువచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడం దారుణమన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పెద్దఎత్తున నిరసన వ్యక్తమవుతోందన్నారు.

కూటమి ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కుతీసుకోవాలని ప్రజలే డిమాండ్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బీబా షా, భవనం రవీంద్రారెడ్డి, సోషల్‌మీడియా స్టేట్ జాయింట్ సెక్రటరీ పాలూరి రాజశేఖర్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి పరమేశ్వరరెడ్డి, దేవంగి చిన్నబ్బాయి. దేవంగి మరియబాబు, మురికిపూడి నాగేశ్వరరావు, మురికిపూడి సాగర్, పెద నాగేశ్వరరావు, సిద్దెల బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

విశేష స్పందన

అచ్చంపేట: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటిసంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. గ్రామాల్లో స్వచ్ఛందంగా సంతకాలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు మిట్టపాలెం, వేల్పూరు గ్రామాల్లో కోటిసంతకాల సేకరణ పోస్టర్స్ విడుదల చేశారు. ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. వేల్పూరులో జరిగిన కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ కన్వీనర్ తిమోది, పొన్నెకంటి కుమారస్వామి, నేతలు, కార్యకర్తలు సంతకాలు సేకరించారు. మిట్టపాలెంలో పార్టీ నేత కొట్టె కోటేశ్వరరావు (నందికొండ) ఆధ్వర్యంలో 'కోటి సంతకాలు' కార్యక్రమం జరిగింది.

పేదలపై కూటమి కుట్ర

పెరికపాడు(క్రోసూరు): పేద కుటుంబాల పిల్లలకు వైద్యవిద్య అందకుండా కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగించే పెద్ద కుట్ర చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు అన్నారు. మండలంలోని పెరికపాడు, ఆవులవారిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన రచ్చబండలో కోటి సంతకాల ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పెరికపాడు సర్పంచ్ శ్రీధర్ ఇంటిలో జరిగిన రచ్చబండలో మండల పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఉన్నత విద్యను అందించాలన్న లక్ష్యంతో 17 మెడికల్ కళాశాలలకు అనుమతి తీసుకొస్తే, కూటమి ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యానికి అప్పగించి వైద్య విద్యను పేదలకు అందకుండా చేసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు.

విజయవంతం చేద్దాం

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సారథ్యంలో కోటి సంతకాలు ఉద్యమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. గ్రామాల్లో స్వచ్ఛందంగా సంతకాలు పెట్టారు. కార్యక్రమంలో నేతలు తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అనుముల రోశిరెడ్డి, గార్లపాటిదాసు, రమణానాయక్, రాంబాబు, హనుమంతరావు, రమేష్, చిన్ననాయక్, నవీన్ ఉప్పు, భాస్కర్, కృష్ణ ఆవులవారిపాలెం గ్రామం నుంచి కేశవరెడ్డి , బంగారురెడ్డి, మస్తాన్, గోపు గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

నేతలు, కార్యకర్తలు కృషి చేయాలి

అమరావతి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమానికి కార్యకర్తలు సహకరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు కోరారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని గ్రామాలలో రచ్చబండ కార్యక్రమం నిర్వహణకు అవసరమైన పుస్తకాలను నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు నాయుడు సాంబశివరావు, నియోజకవర్గ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు షేక్ షరీఫ్, నేతలు వెంపా వాసు, తోకల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



నకరికల్లు ఇందిరమ్మకాలనీలో కోటి సంతకాల సేకరణలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, నేతలు



వేల్పూరులో కోటి సంతకాల సేకరణ పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



ఆవులవారిపాలెంలో..



మిట్టపాలెంలో సంతకాలు సేకరిస్తున్న నేతలు



పెరికపాడులో కోటి సంతకాల సేకరణలో నేతలు



రచ్చబండ కార్యక్రమ నిర్వహణ పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సత్తెనపల్లి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నందిగం దావీదు, స్టూడెంట్ వింగ్‌కు తోడెందుల కిరణ్‌కుమార్, వైఎస్సార్‌టీయూసీకి వల్లం నరసింహారావు, లీగల్‌సెల్‌కు మునావత్ ఏడుకొండలు, బూత్ కమిటీ వింగ్‌కు కాలవపల్లి బ్రహ్మారెడ్డి, మైనార్టీసెల్‌కు షేక్ షబ్బీర్ అహ్మద్, దివ్యాంగుల విభాగానికి జెట్టిబోయిన చిన్నపెద్దిరాజు, డాక్టర్స్ వింగ్‌కు డాక్టర్ మేడికొండ పరమేశ్వరరెడ్డి, సోషల్‌మీడియా వింగ్‌కు కాటేపల్లి శేషుయాదవ్ నియమితులయ్యారు.

పెదకూరపాడులో..

వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. యూత్ వింగ్ అధ్యక్షులుగా లేళ్ల శివరామకృష్ణ (చిరంజీవి), మహిళా విభాగానికి నక్కా రత్నకుమారి, రైతు విభాగానికి మద్రి శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్‌కు మేకల వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్‌కు మేకల లక్ష్మణరావు, ఎస్టీ సెల్‌కు బాణావత్ రామకోటేశ్వరరావు నాయక్, మైనార్టీ సెల్‌కు షేక్ వేల్పూరి అల్లాభక్షు (అల్లా), స్టూడెంట్ వింగ్‌కు బిల్లూరి షషాంక్, పబ్లిసిటీ వింగ్‌కు అనుముల రోసిరెడ్డి, గ్రీవెన్స్ సెల్‌కు తుమ్మా జోసెఫ్ సుధాకరరెడ్డి, వాణిజ్య విభాగానికి దేవరశెట్టి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ వింగ్‌కు నల్లపాటి యోహాన్, ఆర్‌టీఐ వింగ్‌కు అంచూరి హనుమంతారెడ్డి(హనిమిరెడ్డి), వైఎస్సార్ టీయూసీకి షేక్ అబ్దుల్ హఫీజ్, ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్‌కు ఓరుగంట వెంకట రామిరెడ్డి, ఐటీ వింగ్‌కు తాటిపాటి కృష్ణారెడ్డి, డాక్టర్స్ వింగ్‌కు షేక్ ఖాసీం షరీఫ్, ఇంటలెక్చ్యువల్ ఫోరానికి తురగా వెంకటసూర్య మల్లికార్జునరావు, బూత్ కమిటీ వింగ్‌కు నర్రా వాసుదేవరావు, వలంటీర్ల వింగ్‌కు వెలితోటి చిన్నబాబు నియమితులయ్యారు.

కార్మిక హక్కులు హరిస్తున్న పాలకులు



ముప్పాళ్లలో జరిగిన సీఐటీయూ మహాసభలో మాట్లాడుతున్న హరిపోతురాజు

ముప్పాళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాసేలా పనిచేస్తున్నాయని, కార్మిక చట్టాలను తొలగించి వాటి స్థానంలో లేబర్‌కోడ్స్ ప్రవేశపెట్టాయని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హరిపోతురాజు ధ్వజమెత్తారు. మండలంలోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ మండల మహాసభ ఆదివారం జరిగింది. హరిపోతురాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న లేబర్‌కోడ్స్‌తో ప్రయోజనాలన్నీ హరించుకుపోతున్నాయన్నారు. భవన నిర్మాణ కార్మికసంక్షేమ బోర్డు ఉన్నా ఆ నిధులన్నీ ఇతర సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. రాష్ట్రంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకంతో రవాణా రంగ కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.15 వేలతో ఆటోడ్రైవర్లకు ప్రయోజనం లేదని, ఒక్కొక్క కుటుంబానికి రూ.30 వేలు ఇవ్వాలన్నారు. కార్మిక వర్గ ప్రయోజనాల కోసం ఐక్యంగా పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి టి.అమరలింగేశ్వరరావు మాట్లాడారు. సీఐటీయూ మండల నూతన కమిటీ కన్వీనర్‌గా యర్రంశెట్టి సుబ్బారావు, కో కన్వీనర్‌గా చింతపల్లి నాగమల్లేశ్వరరావు, సభ్యులుగా దారా చిన్నారావు, తిరుపతి ఏడుకొండలు, టి.అంకమ్మ, కోటయ్య, ఏసుబాబు, పుల్లారెడ్డిని ఎన్నుకున్నారు.

వీరాస్వామి సేవలు అభినందనీయం



ఆర్థికసాయం అందుకున్న వారితో గంజి వీరాస్వామి, తదితరులు

సత్తెనపల్లి: దాతల సహకారంతో గంజి వీరాస్వామి చేస్తున్న సేవలు అభినందనీయమని న్యాయవాది పిన్నమనేని పాములయ్య అన్నారు. పట్టణంలోని పణిదం సొసైటీ వద్ద దాతల సహకారంతో రూ.50 వేల విలువచేసే సేవా కార్య క్రమాలు గంజి వీరాస్వామి ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. అనంతరం ఎన్నారై గుండవరపు అనిల్ కుమార్ తన తండ్రి వెంకట్రావు జ్ఞాపకార్థం 30 కుటుంబాలకు రూ. 500 నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. అనిల్ కుమార్ సాయంతో ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున ఐదుగురికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. ఊటుకూరి ఉషారాణి జ్ఞాపకార్థం వారి తమ్ముడు సతీష్ సాయంతో రూ. 7వేలతో 100 మందికి ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంచర్ల చిన్ననాగేశ్వరరావు, గంగూరి కళ్యాణ్, గంగూరి సోమనాథ్, గద్దె చలమయ్య, డాక్టర్ బిట్ర నాగరాజు, దివ్వెల శ్రీనివాసరావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

కార్తిక పూజలకు వేళాయె!



సత్తెనపల్లిలో దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం

- శైవక్షేత్రాలు సన్నద్ధం
- ఈ నెల 22 నుంచి నవంబర్ 22 వరకు కార్తిక పూజలు
- నవంబర్ 5న లక్ష దీపోత్సవం

సత్తెనపల్లి: సత్తెనపల్లి నియోజకవర్గం కార్తిక మాస పూజలకు సిద్ధమైంది. ఈ నెల 22 నుంచి నవంబర్ 22వ తేదీ వరకు వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి రోజూ వేకువజామున నాలుగు గంటలకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో శ్రీ దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం, అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వరస్వామి దేవాలయం, గుంటూరు రోడ్డులోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంతో పాటు వివిధ శైవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. నవంబర్ 5న పౌర్ణమి సందర్భంగా లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. 6న శివపార్వతుల కళ్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతం చేయనున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలు

మాదల(ముప్పాళ్ల): అదుపు తప్పి ద్విచక్రవాహనంపై నుంచి పడి ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి స్వల్పగాయాలైన ఘటన ఆదివారం మండలంలోని మాదల గ్రామం వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండకు చెందిన పి.జోసెఫ్ కుటుంబసభ్యులతో ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లికి బయలు దేరాడు. మార్గమధ్యంలో మాదల సమీపంలో రోడ్డుపై గుంతను తప్పించబోయి వాహనం అదుపుతప్పి కింద పడిపోయారు. ఘటనలో జోసెఫ్‌తో పాటు భార్య, ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆటోలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

విద్యార్థిని అదృశ్యం

సత్తెనపల్లి: బి-ఫార్మసీ విద్యార్థిని అదృశ్యంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన విద్యార్థిని గుంటూరులో బి-ఫార్మసీ విద్యనభ్యసిస్తుంది. ఇటీవల తల్లిదండ్రులు ఆమెను ఇంటికి తీసుకువచ్చారు. ఈ నెల 16న ఇంటిలో చెప్పకుండా ఆమె వెళ్ళి పోయి తిరిగి రాకపోవడంతో ఆమె తండ్రి పలుచోట్ల ఆరా తీశారు. అయినా ఫలితం లేక పోవడంతో సత్తెనపల్లిరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఆమె ఆచూకీ తెలిసిన వారు సత్తెనపల్లిరూరల్ సీఐ 9440796231, సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ 08641-232 033 నంబర్లకు తెలియజేయాలని సూచించారు.

అధిక వర్షాలతో పత్తి రైతు దిగాలు

- పెట్టుబడులు కూడా రాని పరిస్థితి!
- రోజు కూలి పోయి, కేజీల లెక్కకు వచ్చింది
- 5, 6 క్వింటాళ్లకు మించి రాని దిగుబడి
- పండిన పంటకూ గిట్టుబాటు ధర ప్రకటించని ప్రభుత్వం



భారీ వర్షాల కారణంగా కాపునకు రాని పత్తి పంట

అచ్చంపేట: అతివృష్టి, అనావృష్టి పత్తి రైతుల పాలిట శాపంగా మారాయి. వర్షాలు లేక ఒక సీజన్, వానలు ఎక్కువై మరో సీజన్, ప్రతి సీజన్‌లో ఏదో విధంగా రైతులు దెబ్బతింటూనే ఉన్నారు. గతేడాది, ఈ ఏడాది పత్తి పంటలు వేసిన రైతులు పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అరకొరగా పండిన పంటకైనా ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటిస్తుందా అంటే అదీలేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతన్నలు ఆందోళనలకు గురవుతున్నారు.

పత్తిపంట వేయాలంటే ఎకరానికి రూ.30 వేల పెట్టుబడి

పత్తి పంట వేయాలంటే ఎకరానికి సుమారు రూ.30వేల వరకు పెట్టుబడులు అవుతాయి. ఇది కాక కొత్తగా కూలి అదనం. విత్తనాల కొనుగోళ్లు, ఎరువు కట్టలు వేసేందుకు, అరకలు దున్నేందుకు, విత్తనాలు విత్తేందుకు, కలుపు తీసేందుకు, ఇలా ఖర్చుల రూపంలో భారీగా పెట్టుబడులు పెరిగాయి. వేసిన పిందె, గూడ నిలబడాలంటే రోజుమార్చి రోజు పురుగు మందులు పిచికారీ చేయాల్సిందే. ఎంత చేసినా పంట చేతికి అందేవరకు రైతన్నలకు ఆందోళనలు తప్పడంలేదు. అదే కౌలు రైతులకు అయితే మరో రూ.20 నుంచి రూ.25 వేలు అదనంగా అవుతుంది.

5,500 హెక్టార్లకు పైగా పత్తి పంట

ఈ సంవత్సరం మండలంలో సుమారు 5,500 హెక్టార్ల పైగా పత్తి పంట వేశారు. గతేడాదితో పోలిస్తే చాలా తక్కువ. జూన్ ఆఖరులో, జూలై మొదటి వారంలో పంట వేస్తే సెప్టెంబరు ఆఖరుకు, అక్టోబరు మొదటి వారంలో మొదటి కోత రైతులకు అందేది. ఆ పంటను అమ్ముకుని పెట్టుబడులకు కోసం చేసిన అప్పులను కొంతవరకు తీర్చుకునేవారు. ఈ ఏడాది ఇంతవరకు మొదటి కాపు రాలేదు. మొక్కలు బాగా పెరిగి, పూతకు వచ్చే సమయంలో కురిసిన వర్షాలకు పంట మొత్తం వర్షార్పణమైంది. పడిన పూత, కాయ రాలిపోయాయి. వాన నీళ్ల రోజుల తరబడి పంట భూమిలో నిలబడటంతో పంట ఉరకేసిపోయింది.


భారీ వర్షాలకు తేమశాతం అధికం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భూమిలో నీళ్లు నిలవడంతో తేమశాతం అధికమై పంట ఉరకేసి ఎకరానికి 5, 6 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితులు కనిపించడంలేదు. ప్రస్తుతం మార్కెట్ ధర నాణ్యమైన పత్తి అయితే క్వింటా రూ.5,000 నుంచి రూ. 5,500 ఉంది. వర్షాలకు తడిసి గుడ్డిపత్తి అయితే రూ.4 వేల నుంచి రూ.5వేల లోపే ఉంది. సగటున ఎకరానికి 6 క్వింటాళ్లు వేసుకున్నా ఎకరానికి రూ.30 వేలు మించి రాదు. కౌలు అయితే కౌలు ధర పంటవేసిన రైతు భరించాల్సిందే.

పత్తి తీసేందుకు కేజీల లెక్కన కూలి

గతంలో పత్తి తీసేందుకు రోజులలెక్కన కూలి ఉండేది. ఉదయం 8కు వచ్చి సాయంత్రం 5గంటల వరకు పత్తి తీస్తే రూ.250 నుంచి రూ.300 వరకు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. కూలీలు పత్తి తీసినందుకు కేజీలు లెక్కన తీసుకుంటూరు. కేజీ పత్తి తీస్తే రూ.13. ఈ లెక్కన క్వింటా పత్తి తీసేందుకు రూ.1300 అవుతుంది. ఒక్కొక్క కూలి రోజుకు 50 కిలోల నుంచి క్వింటా తీసేవారు ఉన్నారు. రోజు కూలీకి, కేజీల లెక్కన తీసే కూలీకి రెండు మూడింతలు ఎక్కువ అవుతుంది. ఎకరాలకు 5 క్వింటాళ్ల దిగుబడి వేసుకుంటే కూలీకే రూ.6500 అవుతుంది.

కూలీ ధర బాగా పెరిగింది



ఐదు ఎకరాల్లో పత్తి పంట వేశా. వర్షాలకు తుడిచిపెట్టుకుపోయింది. పెట్టుబడులు కూడా రావడం కష్టంగా ఉంది. మహా వస్తే 5క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఎకరాకు రూ.30వేలు పెట్టా. కూలి ధర బాగా పెరిగింది. కేజీ పత్తి తీస్తే రూ.13 అవుతుంది. క్వింటాకు రూ.1300 అవుతుంది. ఈ లెక్కన రైతుకు మిగిలేది ఏంటి.

– మేకా శ్రీనివాసరెడ్డి, రైతు, రుద్రవరం